క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ రఘు

కల్లూరు రూరల్: పరిసరాల పరిశుభ్రంగా ఉంటేనే ప్రజారోగ్యం సాధ్యమవుతుందని స్వచ్ఛ భారత్ జిల్లా కోఆర్డీనేటర్ నెల్లూరి అనూప్ తెలిపారు. కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్వచ్ఛ భారత్ మిషన్ ఫేజ్–2పై ఎంపీపీ బీరవెల్లి రఘు అధ్యక్షతన జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. గృహాల్లో వినియోగించిన, వర్షపు నీరు ఇంకేందుకు ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని, తడి, పొడిచెత్తను వేరు చేసి గ్రామపంచాయితీ సిబ్బందికి ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీడీ వెంకటేశ్వరావు, ఎంపీఓ వీరస్వామి, ఏపీఓ హేమామాలిని తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలి

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు ప్రతి నెల ఒకటో తేదీనే జీతభత్యాలు చెల్లించాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సత్తుపల్లి సబ్ ట్రెజరీ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎస్టీఓ పి.సునీల్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బాల నాగేశ్వరరావు, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అగ్గితెగులు నివారణకు జాగ్రత్తలు తీసుకోండి



వరిపంటలను పరిశీలిస్తున్న ఏఈ నర్సింహారావు

ఏన్కూరు: ప్రస్తుతం వరి పంటకు ఆశించిన అగ్గితెగులు నివారణకు చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి నర్సింహారావు రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని తిమ్మారావుపేటలో వరిపంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరిలో అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్–120 గ్రా ఎకరానికి, పొటాష్ లోపానికి గాను 30కేజీల పొటాష్‌ను పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రవికుమార్, రైతులు ఎల్లయ్య, నర్సింహారావు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ ఎదుట రైతు కుటుంబం నిరసన దీక్ష



దీక్ష చేస్తున్న షేక్.లాల్‌సాహెబ్, మీరాబీ

మధిర: మండలంలోని ఖమ్మంపాడు గ్రామానికి చెందిన షేక్.లాల్‌సాహెబ్, మీరాబీ దంపతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన దీక్ష చేపట్టింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తమకు సంబంధం లేకుండా మా పేరుతో గతంలో ఖమ్మంపాడు సొసైటీకి సీఈఓగా పనిచేసిన దొండపాటి వీరభద్రం రుణాలను తీసుకున్నాడని తెలిపారు. తమ పేరుతో రుణాలను తీసుకోవటంతో అట్టి రుణాలను చెల్లించమని సొసైటీ సిబ్బంది ఒత్తిడి తెస్తున్నారని వాపోయారు. తమ పేరుతో రుణాలను తీసుకుని మోసం చేసిన సదరు సీఈఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన దీక్షను చేపట్టామని తెలిపారు.

దీక్షకు పీఓడబ్ల్యూ నాయకుల సంఘీభావం

కల్లూరు: 'డబుల్'గృహాల కోసం లబ్ధిదారులు చేస్తున్న రిలే నిరాహారదీక్ష సోమవారానికి 20వ రోజుకు చేరుకుంది. ఈ శిబిరాన్ని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) నాయకురాళ్లు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు జి.లలితక్క మాట్లాడుతూ.. అధికారులు అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందించాలని డిమాండ్ చేశారు. వీరి న్యాయమైన సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు పరిమళ, సరోజిని, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

తల్లాడ: స్థానిక రింగ్ రోడ్డు సెంటర్‌లో సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో గొల్లగూడెంకు చెందిన సంగెపు వేలాద్రి, అన్నారుగూడెంకు చెందిన బీరెల్లి సాయి గాయపడ్డారు. ఆ సమయంలో ఖమ్మం వెళ్తున్న పెనుబల్లి సీఐ హనోక్ ఆగి గాయపడిన వారిని ఆటోలో ఆస్పత్రికి తరలించారు.

అధికారులేరీ..?



ఎర్రుపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం

ఒక్క ఏఈఈ.. ఐదు విద్యుత్ సబ్‌స్టేషన్లు

- పర్యవేక్షణ లోపంతో అందని విద్యుత్ సేవలు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- గ్రామాల్లో పరిష్కారానికి నోచుకోని మిడిల్ పోల్స్ సమస్య

ఎర్రుపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లోని వినియోగదారులకు విద్యుత్ సేవలు సక్రమంగా అందాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఐదు విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసింది. అయితే వాటి నిర్వహణకు అధికారులను నియమించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. దీంతో ఆయా గ్రామల ప్రజలు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తమ గోడు ఆలకించడం లేదని వినియోగదారులు వాపోతున్నారు.

మంజూరుకు నోచుకోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు..

వ్యవసాయ కనెక్షన్లకోసం దరఖాస్తు చేసుకొన్న రైతులు గత రెండేళ్లుగా ఎదురుచూస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 150 మందికి పైగా రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు అవసరమైన మేరకు లేకపోవడంతో వేసవి కాలంలో ఓవర్‌లోడ్ సమస్య రైతులను వేధిస్తుంది. పలుమార్లు ట్రాన్స్‌ఫార్మర్లను పెట్టమని అడిగిన మొర ఆలకించిన నాధుడే లేడు. దీనికి తోడు విద్యుత్ సిబ్బంది గ్రామాల్లో స్టార్టర్లను తొలగిస్తున్నారు. ఈ విషయంలో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో గృహ వినియోగదారుల విద్యుత్ మీటర్ల రీడింగ్ సకాలంలో నమోదు చేయడం లేదు. దీంతో విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని వారు వాపోతున్నారు. గ్రామాల్లో దాదాపుగా 150కు పైగా మిడిల్ పోల్స్ అవసరం ఉంది. ఈ మేరకు ఏఈఈ శ్రీనివాసరావును వివరణ కోరగా వినియోగదారులకు, రైతాంగానికి మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని, పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వేసవి కాలంలో ఓవర్‌లోడ్ సమస్య ఉన్న మాట వాస్తవమే. కానీ సిబ్బంది కొరత ఉంది. ఈ సమస్య ఉన్నతాధికారుల దృష్టిలో కూడా ఉంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

పాలనా సౌలభ్యం, నాణ్యమైన సరఫరా కోసం సబ్ స్టేషన్లు నిర్మించినప్పటికీ ఏఈఈ, సబ్‌ఇంజనీర్, లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్‌ల కొరత విద్యుత్ శాఖను వేదిస్తుంది. మండలంలో ఇద్దరు ఏఈఈలు ఉండాల్సి ఉండగా మామునూరు సబ్‌స్టేషన్‌కు కేవలం ఒక్కరే ఉన్నారు. ఇక్కడ సబ్ ఇంజనీర్ పోస్టు భర్తీ చేయలేదు. అలాగే ఎర్రుపాలెం సబ్‌స్టేషన్‌కు ఏఈ, ఇద్దరు లైన్‌మెన్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.



మామునూరులో పొలంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు

ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి..



గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఓవర్‌లోడ్ సమస్య వేధిస్తుంది. పలుమార్లు చేసిన విజ్ఞప్తులకు ఇటీవల మంజూరైన 25కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే ఏర్పాటు చేయాలి. గ్రామంలో 17 మిడిల్ పోల్స్, 8 అదనపు పోల్స్ అవసరం ఉందని 3 సంవత్సరాలుగా మొర పెట్టుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
– మోహన్‌రావు, సర్పంచ్, మామునూరు

పొలంలో తీగలు కిందకు వేలాడుతున్నాయి..



వరి పొలంలో మిడిల్ పోల్స్ లేకపోవడంతో తక్కువ ఎత్తులోనే విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. దీంతో వరి కోత సమయంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ఈ సమస్యను గత మూడు సంవత్సరాలుగా అధికారులకు విన్నవించుకుంటున్నప్పటికీ ఫలితం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి.
– సామినేని నర్సింహారావు, రైతు, మామునూరు

జన చైతన్య యాత్రను జయప్రదం చేయండి

వైరా/చింతకాని/ఎర్రుపాలెం: సీపీఎం ఆధ్వర్యాన చేపడుతున్న జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య పిలుపునిచ్చారు. వైరా, చింతకాని, ఎర్రుపాలెంలో సోమవారం జరిగిన నాయకులు, కార్యకర్తల, విలేకరుల సమావేశాల్లో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ జనచైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 17న హన్మకొండలో ప్రారంభమయ్యే జన చైతన్య యాత్ర పాదయాత్ర 19న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి ప్రవేశించి 21నుంచి 25వ తేదీ వరకు ఖమ్మం జిల్లాలో కొనసాగుతుందని చెప్పారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 450 కి.మీ మేర సాగే యాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు. ఈ సమావేశాల్లో సీపీఎం నాయకులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, సుంకర సుధాకర్, బోడపట్ల రవీందర్, పురుషోత్తమరావు, మధు, కృష్ణవేణి, మోహన్‌రావు, రామారావు, సుధాకర్, రజిత, సమత, నర్సింహారావు, మడుపల్లి గోపాలరావు, వత్సవాయి జానకీరాములు, తోటకూరి వెంకటనర్సయ్య, మద్దిని బస్వయ్య, కాటబత్తిన వీరబాబు, గడ్డం రమణ, పులి యజ్ఞనారాయణ, కిరణ్‌బాబు, కూచిపూడి బుచ్చిబాబు, గడ్డం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్ని మండలాల్లోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
– సాక్షి నెట్‌వర్క్



తల్లాడలో కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



పెనుబల్లిలో కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



కల్లూరులో..

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి

వైరారూరల్: ప్రజలు ఆర్టీసీ అందిస్తున్న మెరుగైన సేవలను సద్వినియోగం చేసుకోని సురక్షిత ప్రయాణాలు సాగించాలని మధిర డిపో మేనేజర్ ఎస్.దేవదానం సూచించారు. సోమవారం మండలంలోని గొల్లపూడి గ్రామంలో ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన మాట్లాడారు. ఆర్టీసీ వికలాంగులకు 50 శాతం రాయితీ, విద్యార్థులు ఉచిత బస్సు పాసులతో పాటు వివాహ శుభకార్యాలకు అడ్వాన్స్ లేకుండా బస్సు బుక్ చేసుకోవడమే కాకుండా జూన్ 30 వరకు 10 శాతం రాయితీ కల్పించనున్నట్లు వివరించారు. అంతేకాకుండా హైద్రాబాద్‌లో ఎఫ్24 టికెట్ ద్వారా ఫ్యామిలీ మొత్తం 24 గంటల వరకు సీటీలో ఉచిత ప్రయాణాలు సాగించే సదుపాయం ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జ్ జానీ, చినబాబు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌పై విమర్శలు తగవు

సత్తుపల్లి: సీఎం కేసీఆర్‌పై విమర్శలు సరికాదని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను నిన్నటి వరకు పొగిడి.. ఇప్పుడు ఆత్మీయ సమ్మేళనం పేరుతో విమర్శలు చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కనిపించటం లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఎస్‌కే.రఫీ, యాగంటి శ్రీనివాసరావు, చల్లగుండ్ల కృష్ణయ్య, చెక్కిలా మోహన్‌రావు, కనకగాల వెంకట్రావ్, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, వనమా వాసు, పాల వెంకటరెడ్డి, మట్టా ప్రసాద్, ఎస్‌కే.చాంద్‌పాషా, అద్దంకి అనీల్, ఆనందరావు, రఘు, నాగలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్

పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

కల్లూరు: గ్రామ పంచాయతీలో పని చేస్తున్న సిబ్బందికి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సోమవారం ఇఫ్టూ ఆధ్వర్యంలో కార్మికులు కల్లూరులో నిరసన చేపట్టారు. కామారెడ్డి జిల్లా బీబీపేటలో చనిపోయిన గ్రామ పంచాయతీ కార్మికుడు కొంగరి బాబు కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, భార్య దేవిలక్ష్మికి ప్రభుత్వ ఉద్యోగమివ్వాలని ఐఎఫ్‌టీయూ ఖమ్మం జిల్లా నాయకుడు ఖమ్మంపాటి పుల్లారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,271 గ్రామ పంచాయతీల్లో 50 వేల మంది వరకు కార్మికులు వివిధ పనులు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చే జీతాలు సకాలంలో చెల్లించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ఉద్యోగుల జీతాలు మాదిరిగానే పీఆర్‌సీ ప్రకారం 30 శాతం వేతనం పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు ఊడల కృష్ణ, వజీర్‌మియా, నల్లగట్ల చిన్న, మరియమ్మ, రాధమ్మ తదతరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి పొంగులేటి విరాళం



ఈట్యతండా గ్రామస్తులకు నగదు అందిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కారేపల్లి: మండలంలోని ఈట్యతండాలో నిర్మించనున్న హనుమంతుని గుడి నిర్మాణానికి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ.25 వేలు విరాళాన్ని ఖమ్మంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు అంతా సుఖసంతోషాలతో ఉండాలని, ఆ దేవుని చల్లని దీవెనలు ప్రతి ఒక్కరి పై ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరావు, నాగేశ్వరరావు, హనీఫ్, మజీద్ పాషా, సైదిరెడ్డి, వెంకటరెడ్డి, మున్నా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందిస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని కనకగిరి సిరిపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు షేక్.లతీఫ్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని అందజేశారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, హెచ్‌ఎం ముజీబ్, ఉపాధ్యాయులు సురేష్, అన్వర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థినుల ప్రతిభ

ఏన్కూరు: ఈ నెల 12న ఖమ్మం వర్తకసంఘం భవన్‌లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలికలు ఉదయశ్రీ, పుజశ్రీలు ప్రథమ బహుమతి, 9వ తరగతి చదువుతున్న జాహ్నవి, 6 చదువుతున్న నూసీన్‌లు ద్వితీయ బహుమతి సాధించారు. బహుమతులు సాధించిన బాలికలను, కరాటే మాస్టర్ శ్రీకాంత్‌ను ప్రధానోపాధ్యాయురాలు సుబాషిణి, ఉపాధ్యాయులు అభినందించారు.

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీల్లో ప్రతిభ

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నికల్ విభాగం విద్యార్థులు సౌత్ జోన్ వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ముగ్గురు సౌత్ జోన్ పోటీల జట్టుకు ఎంపికకాగా, ఈ పోటీల్లో జట్టు తృతీయ స్థానం సాధించింది. ఈ జట్టులో ఉన్న కళాశాల విద్యార్థులు జి.రామకృష్ణ, కె.ఆదర్శ్, ఎస్.రవితేజను సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ చెన్నుపాటి విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ వూటుకూరి శేషారత్నకుమారి, పీడీ రఘుపతిరెడ్డి, డిప్లొమా డీన్ తోమండ్రు రాంబాబు తదితరులు సోమవారం అభినందించారు.

'కంటి వెలుగు' పేదలకు వరం



వైరా: మాట్లాడుతున్న ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్

వైరా: బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమం పేదలకు వరమని ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఆయన సోమవారం సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శిబిరంలో నిర్వహించిన మహిళా దినోత్సవ ముగింపు వేడుకలలో పాల్గొని ప్రసంగించారు. ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. అంధత్వ నివారణకు సీఎం కేసీఆర్ ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్పందన, డాక్టర్ ఉదయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు నంబూరి కనకదుర్గ, మహిళా అధ్యక్షురాలు బానోత్ సక్కుబాయి, ఎంపీటీసీ సభ్యురాలు సౌజన్య, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి..

లాండ్రీ దుకాణాదారులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని కోరుతూ లాండ్రీ యజమానులు సోమవారం వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌కు వినతి పత్రం అందించారు. ఎన్నో ఏళ్లుగా లాండ్రీ పనులు నిర్వహిస్తూ బతుకుతున్న తమకు ఉచిత విద్యుత్ ఇచ్చి ఆదుకోవాలన్నారు. తమ రోడ్డుకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో లాండ్రీ యజమానులు గరిడేపల్లి వెంకటనారాయణ, భువనగిరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి..

సత్తుపల్లిటౌన్: మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సత్తుపల్లిలోని 2వ వార్డు అయ్యగారిపేటలో సోమవారం స్థానిక బీసీ హాస్టల్‌లో ఆరోగ్య మహిళ వైద్య శిబిరాన్ని, కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు అవినాష్, మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, సూపర్‌వైజర్లు నర్సింహారావు, అన్నమ్మ, ఏఎన్‌ఎంలు కామేశ్వరి, రమాదేవి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న రవికుమార్



సత్తుపల్లిరూరల్: ఎమ్మెల్యే వెంకటవీరయ్యను సన్మానిస్తున్న స్కూల్ యాజమాన్యం

మధిర: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని అకడమిక్ మానిటరింగ్ జిల్లా అధికారి రవికుమార్ తెలిపారు. స్థానిక సీపీఎస్, మండలంలోని మహదేవపురం ఉన్నత పాఠశాలలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పది విద్యార్థులు సమయాన్ని దృష్టిలో ఉంచుకుని సన్నద్ధం కావాలన్నారు. మండల విద్యాశాఖాధికారి ప్రభాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దయాల్, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేని చదువుతోనే ఉత్తమ ఫలితాలు..

సత్తుపల్లిరూరల్: విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యనందించడం ద్వారా ఉత్తమ ఫలితాలు వస్తాయని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. స్థానిక గుడిపాడురోడ్డులో చైతన్య టెక్నో స్కూల్ 4వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అనంతరం గత విద్యా సంవత్సరం పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కందుకూరు శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ రాయల సత్యనారాయణ, ఓయూ ప్రొఫెసర్ పుచ్చకాయల మురళీధర్‌రెడ్డితో పాటు పాఠశాల యజమాన్యం పాల్గొన్నారు.

ప్రణాళికతో చదవాలి..

ఏన్కూరు: విద్యార్థులు ప్రణాళితో చదివితే పరీక్షల్లో విజయం సాధించవచ్చునని ప్రధానోపాధ్యాయురాలు ఏ.శైలా కోరారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలంటే భయపడకుండా ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో గుడ్ కరస్పాండెంట్ నిజవరా, ప్రధానోపాధ్యాయులురాలు, బ్రిటో, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన అంకమ్మ జాతర



ఆలయంలో పూజలకు హాజరైన భక్తులు

ముదిగొండ: మండలంలోని కమలాపురంలో అంకమ్మ దేవాలయం వద్ద జరుగుతున్న జాతర సోమవారంతో ముగిసింది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అంకమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. శ్రీవిమాన శిఖర, నాగేంద్రస్వామి, పోతురాజు సహిత శ్రీమహాలక్ష్మీ, అంకమ్మ పెద్దమ్మ తల్లి, మద్దిరావమ్మ, అమ్మవార్ల పునఃప్రతిష్ఠల సందర్భంగా కమలాపురం, అయ్యగారిపల్లి గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చంద్రపటము, అమ్మవారి దినెన బండారు, కార్యక్రమాలు నిర్వహించారు.

అంకమ్మ మాలాధారుల తిరుముడులు..

శ్రీఅంకమ్మ, మద్దిరావమ్మ, శ్రీమహాలక్ష్మీ, నాగేంద్రస్వామి, పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవార్ల పునఃప్రతిష్ఠ సందర్భంగా అయ్యగారిపల్లి, కమలాపురంలలోని భక్తులు శ్రీఅంకమ్మ మాలాధారణ గావించారు. 21రోజులు పాటు మాలలు ధరించిన స్వాములు అయ్యగారిపల్లిలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పూజలు నిర్వహించి తిరుముళ్లు కట్టుకున్నారు. ఆలయంలో పూజల అనంతరం తిరుముడులతో కమలాపురంలోని శ్రీ అంకమ్మతల్లి ఆలయానికి చేరుకుని తిరుముడులు సమర్పించారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

మధిర: ఈ నెల 15 నుంచి జరగనున్న ఇంటర్ వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయదాస్ తెలిపారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల కోసం మధిర పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీనిధి, సుశీల జూనియర్ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 858 మంది, ద్వితీయ సంవత్సరంలో 809 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు జరుగుతాయన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించమని తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్

జాగ్రత్తలు పాటించరా..?



ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలోని పలు కంకర క్వారీల నుంచి విచ్చల విడిగా పెద్ద సైజు కంకర రాళ్లను నిర్లక్ష్యంగా టిప్పర్లలో తరలిస్తున్నారు. అతి వేగంగా టిప్పర్లు దుమ్ములేపుకుంటూ క్వారీలనుంచి, కంకర మిల్లులకు తరలిస్తున్నారు. టిప్పర్లకు వెనక ఎటువంటి జాగ్రత్తలు పాటించకుండా రోడ్లపై ఇష్టమొచ్చినట్లు తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో వెనకనుంచి వచ్చే వాహనాలపై ఆ రాళ్లు పడితే ప్రణాలకే ప్రమాదం జరిగే అవకాశముంది. అంతేకాకుండా టిప్పర్లు లేపుతున్న దుమ్ముతో వెనక వచ్చే వాహనదారులకు రోడ్డు అగపడని పరిస్థితి దాపురించింది. కావున ఎటువంటి ప్రమాదం జరగక ముందే రోడ్లపై నీళ్ల చల్లించి, టిప్పర్లకు వెనక డోర్లు బిగించి రాళ్ల తరలించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.
– ముదిగొండ

ప్రశ్నించాల్సిన అధికారి : సంజయ్ కుమార్, మైనింగ్ ఏడీ, ఖమ్మం
సెల్ నంబర్ : 9603134117